# చేవెళ్లకు కొత్త కళ

- పదేండ్లలో రూ.2400 కోట్లతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు
- గ్రామీణ ప్రాంతాలకు బీటీ రోడ్లు, వాగులపై బ్రిడ్జిల నిర్మాణం
- పరిశ్రమల ఖిల్లాగా మారిన షాబాద్, శంకర్‌పల్లి మండలాలు
- శంకర్‌పల్లిలో సీఎం చేతుల మీదుగా రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ప్రారంభం
- మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నల్లానీరు సరఫరా
- బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మారిన చేవెళ్ల నియోజకవర్గ రూపురేఖలు
- ఎమ్మెల్యే కాలె యాదయ్యను హ్యాట్రిక్ కొట్టించేందుకు సిద్ధమవుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు
- ఈ నెల 27న చేవెళ్లలో నిర్వహించే ప్రజాఆశీర్వాద సభకు హాజరుకానున్న సీఎం కేసీఆర్
- అధికసంఖ్యలో తరలిరానున్న ప్రజలు, పార్టీ శ్రేణులు



శంకర్‌పల్లి మండలం కొండకల్‌లో రైల్వేకోచ్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్ (ఫైల్)

షాబాద్, నవంబర్ 25: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నగరానికి అతి దగ్గర్లో ఉన్న చేవెళ్ల నియోజవర్గం అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు దూసుకుపోతున్నది. పదేండ్ల క్రితం అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఈ నియోజకవర్గం ప్రస్తుతం ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతున్నది. స్వరాష్ట్రంలో గత పదేండ్ల కాలంలో రూ.2400 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, మహేందర్‌రెడ్డిల సహకారంతో చేవెళ్ల నియోజకవర్గం పరిశ్రమల ఖిల్లాగా మారింది. షాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో పరిశ్రమల ఏర్పాటుతో వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు, కేసీఆర్ కిట్స్, కుల వృత్తులకు చేయూత తదితర ప్రభుత్వ పథకాల ఫలాలు సబ్బండ వర్ణాల ప్రజలకు అందుతున్నాయి. మిషన్ కాకతీయ ద్వారా చెరువులన్ని పునరుద్ధరణ చేయడంతో నీటితో కళకళలాడుతుండగా, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నల్లానీరు అందిస్తున్నది. ప్రభుత్వ దవాఖానలకు వంద పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతో నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందుతున్నాయి. పల్లెప్రగతి, పట్టణ ప్రగతి ద్వారా పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందడంతో నియోజకవర్గ రూపురేఖలు మారాయి. ఈ ఎన్నికల్లో మూడోసారి బీఆర్‌ఎస్ కాలె యాదయ్యను గెలిపించేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధమవుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 27న చేవెళ్లలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరవుతున్నారు. సభను సక్సెస్ చేసేందుకు పెద్ద ఎత్తున జనాలు తరలిరానున్నారు.

**పరిశ్రమల ఖిల్లాగా షాబాద్, శంకర్‌పల్లి...**

నగరానికి కూతవేటు దూరంలో ఉన్న చేవెళ్ల నియోజకవర్గం పరిశ్రమల ఖిల్లాగా మారింది. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, మంత్రులు సబితారెడ్డి, మహేందర్‌రెడ్డిల సహకారంతో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ఈ నియోజకవర్గం పరిధిలోని షాబాద్, చేవెళ్లలో భారీ పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేశారు. సుమారు రూ.10వేల కోట్లతో షా బాద్ మండలంలోని చందనవెళ్లి, సీతారాంపూర్‌లో పరిశ్రమలు నిర్మాణం చేపడుతున్నారు. చందనవెళ్లిలో ఇప్పటికే ఏర్పాటైన వెల్స్‌పన్, కటేరా, కుందానా, ఆమెజాన్, ఈస్టర్ తదితర కంపెనీల్లో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సీతారాంపూర్‌లో ఎలక్ట్రానిక్ వాహనాల తయారీ కంపనీ నిర్మాణం జరుగుతుంది. దీంతో పాటు కిటెక్స్ అనే కంపెనీ ఏర్పాటు కానుంది. ఈ కంపెనీ నిర్మాణం పూర్తయితే సుమారు 30వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. శంకర్‌పల్లి మండలం కొండకల్‌లో రూ.1000కోట్లతో భారతదేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ సెక్టార్ రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. ఈ ఏడాదిలో సీఎం కేసీఆర్ ఈ రైల్వేకోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఇందులో 2వేల మంది వరకు ఉద్యోగాలు లభించనున్నాయి. కంపెనీల ఏర్పాటుతో చేవెళ్ల నియోజకవర్గం మొత్తం పారిశ్రామిక వాడగా మారిపోయింది.

## పదేండ్లలో ఊహించని అభివృద్ధి



పదేండ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.వేల కోట్ల నిధులతో చేవెళ్ల నియోజకవర్గం ఊహించని రితీలో అభివృద్ధి చెందింది. 2014 కంటే ముందు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గ్రామాలన్నీ నేడు ప్రగతిపథంలో ముందుకు సాగుతున్నాయి. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, మహేందర్‌రెడ్డిల సహకారంతో చేవెళ్ల నియోజకవర్గానికి పెద్ద ఎత్తున కంపెనీలను తీసుకొచ్చాం. కంపెనీల ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతున్నాయి. శంకర్‌పల్లిలో రైల్వేకోచ్, షాబాద్‌లో వెల్స్‌పన్ తదితర కంపెనీల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల అభివృద్ధి, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లానీరు, గ్రామాలకు బీటీ రోడ్లు, అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తమ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం సంతోషంగా ఉన్నది.

**- కాలె యాదయ్య, ఎమ్మెల్యే, చేవెళ్ల**



షాబాద్ మండలం చందనవెల్లిలో వెల్స్‌పన్ కంపెనీలో ఓ విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య (ఫైల్)



షాబాద్ మండలం కుమ్మరిగూడలో బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే తదితరులు (ఫైల్)



షాబాద్ మండలం చందనవెల్లిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెల్స్‌పన్ కంపెనీ

## మారిన చేవెళ్ల రూపురేఖలు

గత పాలకుల హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న చేవెళ్ల నియోజవర్గం తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజవర్గ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గత పదేండ్ల కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.2,400 కోట్లను ఖర్చు చేసింది.

- చేవెళ్లలో 50 పడకల దవాఖాన ఉండగా.. రూ.18కోట్లతో 100 పడకలా దవాఖానగా అప్‌గ్రేడ్ చేసి పేదలకు మెరుగైన వైద్యసేవలందిస్తున్నది.
- మిషన్ కాకతీయ పథకం ద్వారా నియోజకవర్గంలో రూ.50.32కోట్లతో 125 చెరువులను అభివృద్ధి చేశారు.
- రూ.25కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో ఐదు మండలాల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టారు.
- రూ.135 కోట్లతో అంతారం వద్ద మిషన్ భగీరథ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి, నియోజకవర్గంలో మొత్తం 200 ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం చేసి 214 గ్రామాలకు ఇంటింటికీ నల్లాద్వారా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తున్నారు.
- రూ.132 కోట్లతో శంకర్‌పల్లి మున్సిపాలిటీని అభివృద్ధి చేశారు.
- రూ.312 కోట్లతో ఆయా గ్రామాల్లో అర్‌అండ్‌బీ రోడ్లు, వాగులపై వంతెనల నిర్మాణం, రూ.341 కోట్లతో పంచాయతీ రాజ్ రోడ్లు, వంతెనల నిర్మాణాలు చేపట్టారు.
- మన ఊరు-మనబడి ద్వారా 83 పాఠశాలలకు రూ.7కోట్ల నిధులు మంజూరయ్యాయి.
- చేవెళ్ల మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.2కోట్లు మంజూరు చేశారు.
- నియోజకవర్గంలో మూడు గురుకుల పాఠశాలలు, ఒక మాడల్ పాఠశాల ఏర్పాటు చేశారు.
- మండలానికి ఒకటి చొప్పున రూ.3కోట్లతో ప్రతి మండలానికి 5వేల మెట్రిక్ టన్నుల గోదాంల నిర్మాణం చేపట్టారు.
- చేవెళ్ల మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి పుష్కరిణి ఆవరణలో, నవాబుపేట మండల కేంద్రంలో టీటీడీ కల్యాణ మండపం కోసం రూ.2కోట్లు మంజూరు చేశారు.
- నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్ మండలాల్లో ఎస్సీ భవనాల నిర్మాణం కోసం రూ.25లక్షలు నిధులు కేటాయించారు.
- చేవెళ్లలో రూ.50లక్షలతో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు. ఒక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేకంగా కృషి చేశారు.

## ఇంటింటికీ సంక్షేమ పథకాలు

పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రతి నెలా 34,289 మందికి రూ.7.33కోట్లు అందిస్తున్నారు. రూ. 29.62 కోట్లతో 24,687 మందికి కేసీఆర్ కిట్స్ పంపిణీ చేశారు. రైతుబంధు సాయం కింద ఇప్పటివరకు 18,793 మంది రైతులకు రూ.950 కోట్లు ఇచ్చారు. రైతుబీమా పథకం ద్వారా 1,286 మంది రైతుల కుటుంబాలకు రూ.64.30కోట్లు అందించారు. రూ.లక్షలోపు రుణాలను 50,221 మంది రైతులకు రూ.11 కోట్లు మాఫీ చేసింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా 9,981 మంది లబ్ధిదారులకు రూ.83.44కోట్లు అందించగా, దళితబంధు పథకం ద్వారా రూ.10 లక్షల చొప్పున మొత్తం వంద మంది లబ్ధిదారులకు రూ.10కోట్లు అందజేశారు. రూ.4.84కోట్లు ఖర్చు చేసి 22 రైతువేదిక భవనాలు నిర్మాణం చేశారు. సీఎం సహాయ నిధి, ఎల్‌వోసీల ద్వారా 5,649 మంది లబ్ధిదారులకు రూ.23.50కోట్లు అందించారు. గొల్ల, కురుమలకు సబ్సిడీ గొర్రెల పథకం ద్వారా రూ.166 కోట్లతో 12,842 మందికి గొర్రెలు పంపిణీ చేశారు.



షాబాద్ మండలం అంతారం వద్ద ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ తాగునీటి సరఫరా ప్రాజెక్టు



షాబాద్ మండల కేంద్రంలో మిషన్ కాకతీయ ద్వారా ప్రభుత్వం అభివృద్ధి చేయడంతో కళకళలాడుతున్న పహిల్వాన్ చెరువు